మాధవుడి చెంత.. భక్తుల చింత



- మాధవ స్వామి ఆలయ మార్గంలో అసాంఘిక కార్యకలాపాలు
- ఇక్కడ ప్రహరీ నిర్మిస్తే.. మందుబాబులతో మరిన్ని ఇబ్బందులు
- గోడ నిర్మాణంపై పునరాలోచించాలని స్థానికులు, భక్తుల విజ్ఞప్తి



మాధవ స్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఇరువైపులా గోడ నిర్మించేందుకు ఏర్పాట్లు



మాధవధార మాధవ స్వామి ఆలయానికి వెళ్లే మార్గం



ఆలయ మార్గంలో చెట్టు కింద తాగి పడేసిన మద్యం సీసాలు, గ్లాసులు

మద్రిపాలెం: పచ్చని చెట్లు.. చుట్టూ అందమైన కొండలు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో కొలువైన మాధవుడిని ప్రశాంతంగా వెళ్లి దర్శించుకోవాలని భక్తులందరూ కోరుకుంటారు. ఈ క్రమంలో వారికి అపచారాలు, అసాంఘిక కార్యకలాపాలు ఎదురై భావోద్వేగానికి గురవుతున్నారు. మాధవధార మాధవ స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రాత్రి, పగలు తేడా లేకుండా మందుబాబులు, ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం తాగేసి సీసాలు, గ్లాసులు దారంతా పడేస్తున్నా, భక్తులు ఇబ్బంది పడుతున్నా.. అటు పోలీసులు గానీ, ఇటు దేవస్థానం గానీ కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

రక్షణ గోడతో ప్రయోజనమేంటి..?

మాధవ స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా రక్షణ గోడ నిర్మిస్తున్నారు. ఇప్పటికిప్పుడు గోడ ఎందుకు కడుతున్నారో అర్థం కాని స్థితిలో స్థానికులు ఉన్నారు. దేవస్థానం భూములను రక్షించుకోవడానికే అనుకున్నా.. ఆ ప్రాంతంలో అనేక చోట్ల కబ్జాలు చేసి దర్జాగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిని చూసీచూడనట్టు అధికారులు వదిలేస్తున్నారు. అక్కడ అలాంటి చోట ఆక్రమణలు జరగకుండా రక్షణ గోడ కట్టడం వల్ల ఉపయోగం ఉంది కానీ.. అది మానేసి మాధవుడి ఆలయానికి వెళ్లే దారిలో నిర్మించడం వల్ల ఉపయోగమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గోడ నిర్మించడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలు మరికొంచెం పెరిగే అవకాశముందని వాపోతున్నారు. దీని వల్ల ఇప్పటి వరకు రోడ్డుకు ఇరువైపులా చెట్ల కింద కూర్చుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు.. ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా గోడ వెనుక వారి పనులు కానిచ్చేస్తారని చెబుతున్నారు. గంజాయి, మద్యపానం, ధూమపానం వంటివి విచ్చలవిడిగా చేస్తున్నారని, అటుగా వెళ్లే భక్తులు భయాందోళనలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.

రానున్న మాసాల్లో మరింత ఇబ్బంది..

రానున్న నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు కార్తీక మాసం మొదలుకుని మాఘ మాసం.. శివరాత్రి అయ్యేంత వరకు మాధవ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అందులోనూ కార్తీక మాసం వనభోజనాలకు ప్రసిద్ధి. చాలామంది మామిడి తోటల్లో పిక్నిక్, కుటుంబాలతో అనేక కార్యక్రమాలు జరుపుకోవడానికి వస్తునే ఉంటారు. అలాంటప్పుడు ఇలా గోడ నిర్మించడం వల్ల ఇబ్బందులు పడతారని పలువురు చెబుతున్నారు. ఆ మూడు నెలలు జలధారలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకోడానికి అనేక మంది భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుంచే అక్కడికి చేరుకుంటారు. అలాంటప్పుడు గోడ నిర్మించడం వల్ల వచ్చిన భక్తులకు ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేయరని నమ్మకం ఏంటని అడుగుతున్నారు. సింహాచలం దేవస్థానం ఉప దేవాలయమైన మాధవ స్వామి ఆలయమంటే మొదటి నుంచి అధికారులకు చిన్నచూపేనని పలువురు స్థానికులు, భక్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి గోడ నిర్మాణంపై పునరాలోచించాలని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, మందుబాబుల వల్ల ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోడ నిర్మాణం ఆపాలని ఎంపీకి వినతి

ఇటీవల విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు శ్రీ సింహాద్రి అప్పన్న ప్రచార సమితి సమైఖ్య ప్రతినిధులు మాధవ స్వామి ఆలయానికి వెళ్లే దారిలో గోడ నిర్మాణం నిలిపివేయాలని వినతిపత్రం అందజేశారు. గోడ నిర్మాణం వల్ల అనేక ఇబ్బందులున్నాయని, ముఖ్యంగా ప్రకృతి సంపదకు నష్టం వాటిల్లుతుందని వినతిలో పేర్కొన్నారు. ఈ విషయమై దేవస్థానం అధికారులతో మాట్లాడుతామని ఎంపీ హామీ ఇచ్చినట్లు సమైఖ్య ప్రతినిధులు తెలిపారు.

వి'లక్ష'ణంగా దుర్గాదేవి

- రూ.3 లక్షల కరెన్సీ నోట్లతో జయ దుర్గకు అలంకరణ



జయదుర్గాదేవిని రూ.3 లక్షల కరెన్సీతో వి'లక్ష'ణంగా అలంకరించారు. గురుద్వారా కూడలి వద్ద ఉన్న జయ దుర్గ ఆలయంలో అమ్మవారిని, మండపాన్ని రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లతో మాలలుగా, పుష్పాలుగా కూర్చి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. – సీతంపేట

వెలమ ప్రతిభా పురస్కారాల ప్రదానం నేడు

మురళీనగర్: మురళీనగర్, మాధవధార వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు వెలమ ప్రతిభా పురస్కారాల ప్రదానం నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ వర్మా కాంప్లెక్స్ సమీపంలోని ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీజీజీ కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వెలమ సంఘం వ్యవస్థాపకుడు, ముఖ్య సలహాదారు రొంగలి జగన్నాథం పాల్గొంటారని, మురళీనగర్, మాధవధార వెలమ వర్గీయులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం: అబిద్‌నగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ(ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అబిద్‌నగర్, షాదీకానా ఏరియా, ముస్లిం తాటి చెట్లపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సీతంపేటలో మహాన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సంపంగి శ్రీనివాసరావు తదితరులు

సీతంపేట: శ్రీదుర్గా దంతేశ్వరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతంపేటలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథులు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సింహాచలం దేవస్థానం బోర్డు మాజీ సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, స్థానిక నాయకుడు భీమవరపు శ్రీనివాసరావు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సుమారు 3 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భోగవిల్లి గోవింద్, ఇప్పిలి అప్పలనాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవీఎంసీ సిబ్బందికి దసరా కానుక



శానిటేషన్ సిబ్బందికి మిఠాయిలు అందిస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులో పని చేస్తున్న శానిటేషన్, వాటర్ వర్క్స్, సివిల్ వర్క్స్ విభాగం సిబ్బందికి శుక్రవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ దసరా కానుకగా స్వీట్లు అందజేశారు. తన వార్డులో పనిచేస్తున్న జీవీఎంసీ సిబ్బందితో కలిసి దసరా పండగ సంతోషాన్ని పంచుకోవడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు.


సీజనల్ జ్వరాలపై అవగాహన



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి గణేష్‌నగర్‌లో జోన్-5 పబ్లిక్ హెల్త్ మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలపై అవగాహన కల్పించారు. సీజనల్ జ్వరాలపై తీసుకోవాలని జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి, ఎస్‌ఎస్ జనార్దనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడుబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ వ్యతిరేక పోరుబాటుకు ఏడాది



మాట్లాడుతున్న నరేంద్రరావు

డాబాగార్డెన్స్: విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళన ఈ నెల 30 నాటికి ఏడాది అవుతుందని వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి టి.నరేంద్రరావు, సిటు నాయకులు కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, బి.జగన్ తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం కింద ఆస్పత్రిని ప్రైవేటీకరించాలని చూస్తున్నారన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, పెన్షనర్లు ఆరోగ్య సంరక్షణకు పోర్టు ఆస్పత్రిపై ఎక్కువగా ఆధారపడుతున్నారని, అటువంటి ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై వినతి



ఈపీడీసీఎల్ అధికారి చందుకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సిటు రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ నేతృత్వంలో ఏపీఈపీడీసీఎల్ ఫైనాన్స్ ఎండీ చందు ద్వారా సీఎండీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో మూడు దశాబ్దాలుగా చాలీచాలని జీతాలతో, అద్దె ఇళ్లలో, పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో, విద్యా, వైద్యం ఖర్చులతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. 2022 పీఆర్‌సీ బకాయిలు, పెయిడ్ హాలిడేస్ బకాయిలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలపై అనేక సార్లు ఉన్నతాధికారులకు, విద్యుత్ శాఖ మంత్రికి, ట్రాన్స్‌కో సీఎండీకి, ఇంధన శాఖ కార్యదర్శికి విన్నవించుకున్నామని, స్పందన లేదని చెప్పారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరినీ సంస్థలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని, యాజమాన్యమే జీతాలు చెల్లించాలని కోరుతూ పలు డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, చంద్రశేఖర్, సత్యారావు పాల్గొన్నారు.

వచ్చే నెల 10లోగా పంటల నమోదు



సీతమ్మధార రైతుబజార్‌లో రైతులతో మాట్లాడుతున్న హెచ్‌వో సోనీ

సీతంపేట: అక్టోబర్ 10వ తేదీ లోగా రైతులు తాము పండిస్తున్న పంటల వివరాలు, ఈ క్రాప్ సర్టిఫికెట్లను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని హార్టికల్చర్ ఆఫీసర్ (హెచ్‌వో) సోనీ తెలిపారు. శుక్రవారం ఆమె నరసింహనగర్ రైతుబజార్‌ను సందర్శించారు. రైతులతో సమావేశమై పంటల వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. బజారులో ఏర్పాటు చేసిన సబ్జీ కూలర్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

పంటల నమోదుపై రైతులకు అవగాహన

తాటిచెట్లపాలెం: రైతులు పండిస్తున్న పంటల నమోదుపై శుక్రవారం సీతమ్మధార రైతుబజార్‌లోని రైతులకు హార్టికల్చర్ ఆఫీసర్ సోని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండిస్తున్న పంటల వివరాలు(ఈ-క్రాప్ సర్టిఫికెట్)ను వారి రైతు భరోసా కేంద్రాల్లో అక్టోబర్ 10 లోపు నమోదు చేయించుకోవాలని సూచించారు. సబ్జీ కూలర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

దళితులపై అమానుష ఘటనలు బాధాకరం



నిరసన తెలుపుతున్న గొల్లమాల అప్పారావు, దళిత సేన నాయకులు

కంచరపాలెం: కృష్ణా జిల్లా నందిగామలో జరిగిన అమానుష సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన ప్రధాన కార్యాలయంలో నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ నందిగామలో సంచార జాతికి చెందిన ఈగ రాంబాబు అనే యువకుడి మృతదేహాన్ని పూడ్చడానికి ఏడు శ్మశాన వాటికలు ఉన్నా.. చోటు ఇవ్వకపోవడం అత్యంత బాధాకరమన్నారు. అంతిమ సంస్కారంలో ఆరడుగుల జాగా ఇవ్వకుండా అగ్రకుల వర్గాలన్నీ కలిసి అడ్డుకున్నాయన్నారు. ఆరడుగుల స్థలం ఇవ్వండి.. దహన సంస్కారాలు చేసుకుంటామని పుట్టెడు దుఃఖంలో సంచార జాతికి చెందిన ఆ కుటుంబం అన్ని సామాజిక వర్గాల వారిని కలిసి వేడుకున్నా.. ఏ ఒక్కరూ కనికరించకపోవడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నా కూడా దళితులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, తాటిపూడి సీతారామ్, గొల్లమాల మీనా, చింతాల మల్లికార్జునరావు, లంక రామారావు, ఆర్.వెంకటారావు, బైరవమూర్తి, బొత్స అప్పారావు, టి.గణేష్, సుబ్రహ్మణ్యం, ధనాల అప్పారావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు

మహారాణిపేట: కాలేజీల్లో ర్యాగింగ్ అనేది తీవ్రమైన నేరం అని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో ర్యాగింగ్ నివారణపై వైద్య విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు సంబంధించిన చట్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌పై విద్యార్థులు భయపడకుండా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఏఎంసీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జయ దుర్గమ్మకు జేజేలు



పాత రేసపువానిపాలెంలో మహాలక్ష్మి దేవిగా దుర్గాదేవి



సీతన్న గార్డెన్స్‌లో మహాలక్ష్మి దేవిగా కనకదుర్గమ్మ



లలితా పీఠంలో గజలక్ష్మిగా పద్మావతి అమ్మవారు

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో పద్మావతి అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. ఉదయం చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, శ్రీచక్రనవావరణ, సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, చండీ హోమం చేశారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేదమంత్రాల మధ్య లలితాదేవి హోమం, మహాలక్ష్మి షడక్షరి, ఖడ్గమాల హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. శనివారం ఉదయం 3.30 గంటలకు వారాహిదేవి హోమం, 10 గంటలకు రాజశ్యామల హోమం జరుగుతాయని, సంతానలక్ష్మిగా అమ్మవారు దర్శనమిస్తారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

మహాలక్ష్మి దేవిగా పార్వతీదేవి

సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవి మహాలక్ష్మి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు నిర్వహించారు.

శాంతి స్వరూపిణికి కుంకుమ పూజలు

పాత రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం పక్కన గల శాంతి స్వరూపిణి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కనకాంబరం రంగు చీరలో మహాలక్ష్మి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. శనివారం లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ తెలిపింది.

మహాలక్ష్మి దేవిగా కనకదుర్గమ్మ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార సీతన్న గార్డెన్స్‌లోని శ్రీకనకమహాలక్ష్మి, గాయత్రి దేవి, కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు ఐదో రోజు మహాలక్ష్మి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు.

అక్టోబర్‌లో షాపింగ్ ఫెస్టివల్

- 4 వారాల ప్రణాళికను వివరించిన కలెక్టర్

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నాలుగు వారాల ప్రణాళికను అమలు చేస్తున్నామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. శుక్రవారం, సెక్రటేరియట్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' అనే నెల రోజుల కార్యక్రమం, సీజనల్ కండీషన్స్, పీఎం కుసుమ్ పథకం, బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్ విండ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ప్రారంభమైందని, 25 నుంచి 29 వరకు పొదుపు అంశాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 30 నుంచి అక్టోబరు 6 వరకు వ్యవసాయం, ఇతర వృత్తులపై వారికి, 7 నుంచి 13 వరకు విద్య, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితరాల గురించి వివరిస్తామన్నారు. అక్టోబరు 14 నుంచి 18 వరకు టూరిజం, సేవా రంగం, పునరుత్పాదక శక్తి, ఆటోమొబైల్స్ మొదలైన అంశాలపై అవగాహన, షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో అక్టోబర్ 8,9 తేదీల్లో 'స్వాతంత్ర్యానంతర తెలుగు-హిందీ సాహిత్యంలో మహిళా రచయితల సాహిత్య కృషి' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. రైటర్స్-జర్నలిస్ట్స్ అసోసియేషన్ భారత్ సౌజన్యంతో జరగనున్న రెండు రోజుల సదస్సులో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు ప్రధాన వక్తలుగా పాల్గొంటారన్నారు. తెలుగు-హిందీ సాహిత్యాల్లో రచయిత్రుల శైలి, రచనా విధానం, వంటి అంశాలపై ప్రసంగిస్తారని కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జె.నిర్మల, ఎస్.దీప్తి, కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

స్టెమ్ సెల్ దానంపై అవగాహన



అతిథులు అధ్యాపకులతో విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, బోటనీ విభాగం, గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో డాత్రీ-బ్లడ్ స్టెమ్ సెల్ డోనర్ రిజిస్ట్రీ, ఇండియా సహకారంతో రక్త, స్టెమ్ సెల్‌దానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ జన్యు విశ్లేషణ, మూలకణ మార్పిడి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ములగాడ సూర్యనారాయణ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు కేసులు ఉపసంహరించుకుంటాం



మాట్లాడుతున్న ముదపాక రైతులు

సీతంపేట: ముదపాకలో జరిగిన ల్యాండ్ పూలింగ్‌లో ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం నచ్చక గతంలో కొంత మంది రైతులు కోర్టుకు వెళ్లడం వల్ల ఆ ప్రక్రియ ఆగిపోయిందని ముదపాక రైతులు సారిపల్లి భీమేశ్వరరావు, నీలాపు రమణ తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో రైతులను తప్పుదారి పట్టించడం వల్ల కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని, కోర్టులో ఇప్పటి వరకు ఐదు కేసులు వేసి ఉన్నామని, తమకున్న బాధలో రెవెన్యూ అధికారుల పట్ల తప్పుగా మాట్లాడామని, ఇవన్నీ తెలియకుండా చేసినవని చెప్పారు. ఇపుడు ల్యాండ్ పూలింగ్‌పై పూర్తి అవగాహన వచ్చిందని, కోర్టులో ఉన్న కేసులను ఉపసంహరించుకుంటామని కలెక్టర్, జేసీ, ఆర్డీవోలకు విన్నవించామన్నారు. ఉన్నతాధికారులందరూ మా విన్నపాన్ని మన్నించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో ముదపాక రైతులు గొరపల్లి సత్యారావు, పి.శివ, ముదపాక అప్పారావు, గొలగాని సంతోష్‌కుమార్, ముళ్ళల రామకృష్ణ, ముదపాక శ్రీను, సారిపల్లి చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.